క్లుప్తంగా

వారంపాటు రైల్వేగేటు మూసివేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటును వారంరోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుంచి 7వరకు రైల్వేట్రాక్ నిర్మాణ పనులు, మరమ్మతు కోసం మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకొని సహకరించాలని కోరారు.

విద్యుత్ లైన్లు సరి చేశారు



స్తంభాన్ని సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో 'మృత్యు పాశాలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏడీఈ రాంచందర్ ఆదేశాల మేరకు ఏఈ దీక్షిత్ వేమనపల్లి, మంగెనపల్లి గ్రామ శివారుల్లోని విద్యుత్ లైన్లను సరి చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో తల్లీబిడ్డతో సిబ్బంది

దండేపల్లి/లక్సెట్టిపేట: దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన గర్భిణి మహిళ మల్లేశ్వరి సోమవారం అర్ధరాత్రి సమయంలో పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబం సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గుడిపేట గ్రామం వద్ద పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చాకచక్యంతో వ్యవహరించి డెలివరీ చేసిన ఈఎంటీ తిరుపతి, పైలెట్ సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

'టచ్'లో యాంజియోప్లాస్టీ విజయవంతం



శస్త్ర చికిత్స అనంతరం పేషెంట్‌తో డాక్టర్ రాజేశ్, వైద్య బృందం

పాతమంచిర్యాల: మంచిర్యాల టచ్ ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేశ్ బూర్కుండే క్లిష్టమైన మూత్రపిండ యాంజియోప్లాస్టీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ వైద్యులు రాజేష్ మాట్లాడారు. హృదయ నాళాల సంరక్షణలో అగ్రగామిగా ఉన్న మా ఆసుపత్రి స్థానాన్ని ఈ మూత్రపిండ యాంజియోప్లాస్టీ శస్త్రచికిత్స బలోపేతం చేసిందన్నారు. అత్యాధునిక హృదయ నాళాల సంరక్షణలో అగ్రగామిగా నిలవడం గర్వంగా ఉందన్నారు. ఈ అద్భుత విజయానికి కారకులైన డాక్టర్ రాజేష్, వైద్య బృందాన్ని ఆసుపత్రి నిర్వాహకులు మాటేటి శ్రీనివాస్ అభినందించారు.

కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు



పూజలు చేస్తున్న గిరిజనులు

జన్నారం: మండలంలోని పలు గిరిజన గూడాల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. లోత్‌ఒర్రె గ్రామంలో ఆదివాసీ గిరిజనులు గుస్సాడీ వస్తువులకు పూజలు చేశారు. కొందరు యువకులు గుస్సాడీ వేషధారణతో నృత్యం చేశారు. హాస్టల్ తాండా, నర్సింగాపూర్ తదితర గ్రామాల్లో గుస్సాడీ సంబురాలు కొనసాగుతున్నాయి.

'అనుమతులు తప్పనిసరి'

వేమనపల్లి: మండలంలోని ఏ గ్రామంలోనైనా దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా బాణసంచాలు అమ్మితే చర్యలు తప్పవని ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. అనుమతి కలిగి ఉన్న దుకాణదారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఊపందుకున్న కొనుగోళ్లు



- విభిన్న ఆకృతుల్లో లభిస్తున్న మట్టి ప్రమిదలు
- రూ.10 నుంచి 300 వరకు పలుకుతున్న ధరలు

మంచిర్యాలఅర్బన్: దీపావళిని పురస్కరించుకొని మార్కెట్లో మట్టి ప్రమిదల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. విభిన్న ఆకృతుల్లో రూపొందించిన ప్రమిదలు, లాంతర్లు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలో గంగారెడ్డి రోడ్, మార్కెట్‌రోడ్‌లో స్వస్తిక్, శంకం, కొబ్బరికాయ, తులిసి కోట, దేవతామూర్తుల ఆకృతిలో తయారైన ప్రమిదలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రూ.10 నుంచి 300కుపైగా ధరలు పలుకుతున్నాయి.



మార్కెట్లో విభిన్న ఆకృతుల్లో మట్టి ప్రమిదలు





'మార్కెట్‌కు వెంకటస్వామి పేరు పెట్టడం బాధాకరం'

బెల్లంపల్లి: కూరగాయల మార్కెట్‌కు కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి పేరు పెట్టడం బాధాకరమని ఎంసీపీఐ (యూ), ఎన్సీపీ నాయకులు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్నకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో కొనసాగే నాయకులు అవకాశ రాజకీయాల కోసం కాకా వెంకటస్వామి పేరు పెట్టడానికి మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఈ తీరు ఏమాత్రం సరైంది కాదని విమర్శించారు. మార్కెట్‌కు వ్యక్తుల పేర్లు కాకుండా వ్యవస్థలో మార్పులు తెచ్చి, దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం భావ్యంగా ఉంటుందన్నారు.



ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం ఇస్తున్న శ్రేణులు

కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయకార్యదర్శి పి.వెంకటేష్, ఎన్సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, నాయకులు రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లేశ్ పేరు పెట్టే వరకు పోరాటం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే, అమరజీవి గుండా మల్లేష్ పేరు పెట్టేవరకు ప్రజా పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి అన్నారు. బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత రాష్ట్రపతి పదవికి పోటీ పడిన కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి పేరు పెట్టడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కూరగాయల మార్కెట్ భవనానికి, వెంకటస్వామికి ఎలాంటి సంబంధం లేదన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. వెంకటస్వామి పేరు ఖరారు చేస్తూ సభ్యులు చేసిన మున్సిపల్ తీర్మానాన్ని పున:సమీక్షించాలని కోరారు. స్థానికుడైన గుండా మల్లేష్ ఎంతో నిజాయతీతో ప్రజాప్రతినిధిగా కొనసాగారని, రాజకీయాల్లో ఆదర్శవంతంగా నిలిచారని గుర్తు చేశారు. మరోసారి మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పున:సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే మిగతా రాజకీయపక్షాలతో కలిసి రిలే నిరాహార దీక్షలు, ప్రజా పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు పెట్టాలని కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు సీపీఐ బెల్లంపల్లి పట్టణకార్యదర్శి ఆడేపు రాజమొగిలి తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, బీకేఎంయూ జాతీయసమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, బెల్లంపల్లి మండల సీపీఐ కార్యదర్శి బొ.లక్ష్మీనారాయణ, నాయకులు కె.రాజేష్, జీసీ మాణిక్యం, పి.శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటస్వామి

ఘనంగా ధన్వంతరి జయంతి

నస్పూర్: ధన్వంతరి జయంతి వేడకలను మండల ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉచిత ఆయుర్వేద క్యాంపు, అవగాహన శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్, మెడికల్ ఆఫీసర్ పద్మజ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమత, ఫార్మాసిస్టు పుష్పాంజలి, ఐసీడీఎస్ కోఆర్డినేటర్ రజిత, యోగా ఇన్‌స్ట్రక్టర్ శైలజ, సిబ్బంది ప్రదీప్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రయ్య, అధ్యక్షుడు ఎనగందుల వెంకటేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుర్మళ్ల మోహన్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి స్వామి, సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మజ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 16, 17 తేదీల్లో మంచిర్యాలలోని సైన్స్ సెంటర్‌లో జరిగిన జిల్లా స్థాయి కళోత్సవాల్లో డ్రామ ట్రెడిషనల్, స్టోరీ టెల్లింగ్ అంశాల్లో ప్రథమ స్థానాన్ని పొంది నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని సీసీఈఆర్‌టీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం జిల్లా విద్యాధికారి యాదయ్య, గైడ్ టీచర్ శాంకరిని, కళోత్సవాల కన్వీనర్ సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు. ఈ నెల 28వ తేదీన గ్లోబల్ చాలెంజ్ 2024వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గోల్కొండ క్లబ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాఠశాలకు చెందిన రషిత, మనస్విని పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్ రావు, సిబ్బంది అభినందించారు.

ఆర్డీవోను కలిసిన టీఎన్‌జీవో నాయకులు

పాతమంచిర్యాల: మంచిర్యాల నూతన ఆర్డీవోగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన గూడురు శ్రీనివాస రావును టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టీఎన్‌జీవో నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో పట్టణ అధ్యక్షుడు నాగుల గోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు మరో దారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌కు కొత్తగా మరో దారి సౌకర్యం కల్పించడానికి మార్గం సుగమమైంది. ఇప్పటి వరకు బెల్లంపల్లి బస్తీ, ప్రగతి జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గాల్లో మాత్రమే రోడ్డు సదుపాయం ఉండగా, కొత్తగా బజారు ఏరియా ప్రధాన రహదారి సర్లేజ్ డ్రైనేజీ పక్క నుంచి మరో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాత బస్టాండ్, బజారు ఏరియా ప్రాంతం నుంచి మార్కెట్‌కు వచ్చే పురప్రజలకు కొత్తగా నిర్మించనున్న రోడ్డు సౌకర్యంగా ఉండనుంది. ఓ షాపు యజమాని కోర్టులో దావా వేయడంతో ఈ మార్గంలో రోడ్డు నిర్మాణానికి వీలు కుదరని పరిస్థితులు ఏర్పడ్డాయి. తాజాగా షాపు యజమానితో సంప్రదింపులు జరిపి, మార్కెట్‌లో షాపు కేటాయించడానికి అంగీకారం తెలపడంతో మార్గం సుగమమైంది. ఈ మేరకు కోర్టులో వేసిన పిటీషన్‌ను వెకెట్ చేయడానికి షాపు యజమాని అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో అడ్డుగా ఉన్న షాపును మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించే చర్యలు చేపట్టారు. రూ.7కోట్ల అంచనాతో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్‌కు ఇకపై మూడు వైపుల రోడ్డు సౌకర్యం కలగనుంది.



షెడ్ తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎరువుల వాడకంపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం భూసార విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజమణి మాట్లాడుతూ.. భూసార పరీక్ష చేయించుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష ద్వారా మట్టి నమూనాల విశ్లేషణ ద్వారా సూక్ష్మపోషకాలు, స్థూల పోషకాల నిర్ధారణ జరుగుతుందని, పంటలకు ఎంత ఎరువులు వినియోగించాలో తెలియజేశారు. అతిగా యూరియా, డీఏపీ ఎరువులు వాడటం వల్ల సూక్ష్మ పోషకాల అసమతుల్యత ఏర్పడి పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు కొమురయ్య, మౌనిక, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో శాస్త్రవేత్త, వ్యవసాయాధికారులు

పత్తి పంటల పరిశీలన

భీమారం: మండలంలోని ఆరెపల్లి శివారులో పత్తి పంటలను మంగళవారం ఏవో సుధాకర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. గులాబీ రంగు పురుగుతో పాటు పొగాకు లద్దెపురుగు ఆశించినట్లు గుర్తించారు. నివారణ కోసం వెంటనే చర్యలు చేపడితే పంట దిగుబడి ఆశించిన మేరకు వస్తుందన్నారు. నివారణ కోసం నోవాల్యూరన్ 230మిల్లీలీటరుని లేదా ఏమామెక్టిన్ జెంజోయేట్250గ్రాములను ఎకరానికి పిచికారీ చేసి పొగాకు లద్దె పురుగుని నివారించవచ్చన్నారు. గులాబీ పురుగు నివారణ కోసం థయోమెథాక్సిమ సైహలాత్రిన్ 200మిల్లీలీటరుని 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి సన్మానం

శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని సింగరేణి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఓసీపీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, అన్ని కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జీఎంను శాలువాతో సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, బీసీ సంఘాల నాయకులు కొమురయ్య, బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, మదన్, వీర ప్రతాప్, బానేశ్, గని సంక్షేమ అధికారి శంకర్‌లు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై సీఐటీయూ నాయకులు జీఎంను సన్మానించారు. సీపతి బానేశ్, జగన్‌మోహన్‌రెడ్డి, ఓదెలు, మహేందర్ పాల్గొన్నారు.

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న సంజీవరెడ్డిని అధికారులు సన్మానించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజీవరెడ్డిని శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈ డీ రాజశేఖర్ రావు, ఇందారం ఓసీపీ పీవో ఏవీ.రెడ్డి, ఏజీఎంలు కెఎస్ఎన్ ప్రసాద్, మధన్‌మోహన్, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీని వాస్, శ్రీరాంపూర్ ఏరియా ప్రెసిడెంట్ కెవీరెడ్డి, ఎస్‌వోటీ ఈడీ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీపీపీలో జీఎంను సన్మానిస్తున్న అధికారులు

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీ, ఏరియా ఆసుపత్రిలో మంగళవారం మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళా ఉద్యోగుల విద్యార్హతల ఆధారంగా వివిధ డిసిగ్నేషన్‌లలో అవకాశం కల్పించేందుకు కౌన్సెలింగ్ చేపట్టారు. మహిళా ఉద్యోగులు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణనందించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు ఏరియా ఎస్‌ఓటుజీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సుధీర్, ఐఈడీ రాజన్న, డాక్టర్ జయవాణి పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

పాతమంచిర్యాల: ఈ నెల 31న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, నాయకులు దాగం మల్లేష్, కోశాధికారి తోకల సరస్వతి పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఐఎన్టీయూసీలో చేరిక



బాపుకు స్వాగతం పలుకుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఏఐటీయూసీ మైనింగ్‌స్టాఫ్ సబ్ కమిటీ బ్రాంచీ కార్యదర్శిగా పనిచేసిన మారుపెల్లి బాపు ఐఎన్టీయూసీలో చేరారు. రసూల్‌పల్లిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బీ జనక్ ప్రసాద్ సమక్షంలో బాపు యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు శ్యాం, భీంరావు, స్వామి, తిరుపతి రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు వైద్య శిబిరం

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా ప్రారంభించారు. రిటైర్డ్ కార్మికులకు ఇది చక్కని అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు గుర్రం కిరణ్, వైద్యులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలి

జన్నారం: ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో పూర్తి స్థాయిలో అమలు కావడానికి కృషి చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ఔట్ సోర్సింగ్ రద్దు చేస్తూ, జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ నాగభూషణంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ప్రధానోపాధ్యాయురాలికి వీడ్కోలు

జైపూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రదానోధ్యాయురాలిగా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ పొందుతున్న అలీస్ మాధుర్యకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ బృందం, స్థానిక తాజా మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు హెచ్‌ఎం అలీస్ మాధుర్యను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన మొగుర్ల శ్రావ్య కొన్ని రోజులుగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును విన్నవించగా సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ అందించేలా కృషి చేశారు.

రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా శ్రావ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

పీఏసీఎస్ పాలకవర్గ సభ్యుల ఎన్నిక

వేమనపల్లి: నీల్వాయిలోని మండల వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న 9, 12వ వార్డులకు సంబంధించిన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. 9వ వార్డు సభ్యుడిగా గెలుపొందిన కిషన్‌రావు, 12వ వార్డు సభ్యుడిగా గెలుపొందిన కిష్టాగౌడ్ మృతి చెందారు. వారి స్థానంలో 9వ వార్డుకు మానేపల్లి ఎల్లయ్య, 12వ వార్డుకు తలండి లచ్చన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని నంనూర్, గుడిపేట గ్రామాల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. హాజీపూర్ మండల పశువైద్యాధికారిణి డాక్టర్ శాంతిరేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 140ఆవు జాతి, 356 గేదె జాతి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ అగ్నివేశ్, పశువైద్య సహాయకుడు నారాయణ, గోపాల మిత్ర రవి, పశు యజమానులు పాల్గొన్నారు.

నియామకం

మందమర్రిరూరల్: టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా రామకృష్ణాపూర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కిని నర్సింహులు ఆదేశాలు జారీ చేశారు.